క్లుప్తంగా

వర్షం నీటితో అవస్థలు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డులో వర్షపు నీరు

విజయనగరం ఫోర్ట్: నగరంలోని అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డులో వర్షపు నీరు రోజులు తరబడి నిల్వ ఉంది. ఈ నీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మోడ్రన్ కిచెన్ సెంటర్

- ప్రారంభించిన నాబార్డ్ సీజీఎం



కిచెన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నాబార్డ్ సీజీఎం గోపాల్

విజయనగరం అర్బన్: టీటీడీసీ ప్రాంగణంలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సెటి ఉచిత శిక్షణా కేంద్రంలో వసతి అభ్యర్థుల సౌకర్యార్థం మోడ్రన్ కిచెన్ సెంటర్‌ను నాబార్డ్ అమరావతి సర్కిల్ సీజీఎం ఎంఆర్ గోపాల్ మంగళవారం ప్రారంభించారు. నాబార్డు ఆర్థిక సహాయంతో శిక్షణా కేంద్రానికి అవసరమైన వివిధ సామగ్రిని అందజేసారు. ఇందులో భాగంగా మోడ్రన్ కిచెన్ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌సెటి డైరెక్టర్ టీబీవీ రమణ, నాబార్డ్ డీడీఎం టి.నాగార్జున, నాబార్డ్ ఏజీఎం కందల్ సింగ్, ఏఎల్‌డీఎం ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నుంచి పోలీస్ బ్యారెక్సు జంక్షన్ వరకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారికి సకాలంలో ఆస్పత్రికి చేర్పించగలిగితే ప్రాణాలు కాపాడడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే ప్రాణాలు కాపాడుకోవచ్చునని తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడపకూడదన్నారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలను నడపరాదని అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, ఆర్‌ఎంఓ డాక్టర్ ఎన్.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: ఇంట్లో అలిగి స్కూల్‌కి వెళ్లకుండా విజయనగరం వచ్చేసిన బాలుడు ఎట్టకేలకు వన్‌టౌన్ పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు చేరాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం బీసీ కాలనీకి చెందిన 13 ఏళ్ల గొర్లె యశ్వంత్ ఇంట్లో అలిగి తల్లిదండ్రులకు చెప్పకుండా స్కూల్‌కి వెళ్లకుండా విజయనగరం వచ్చి ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో తిరుగుతున్నాడు. హెడ్ కానిస్టేబుల్ రమణారావు బాలుడిని చూసి సందేహం వచ్చి వన్‌టౌన్‌కి తీసుకువచ్చి వివరాలు సేకరించారు. సీఐ సమక్షంలో తల్లిదండ్రులకు సమాచారమందించారు. తల్లిదండ్రులు వచ్చిన తర్వాత బాలుడిని అప్పగించారు. బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మైనర్లను ప్రమాదాల్లోకి నెట్టొద్దు

- తల్లిదండ్రులకు ఎస్పీ కౌన్సెలింగ్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: మైనర్‌లకు వాహనాలిచ్చి వారిని ప్రమాదాల్లోకి నెట్టవద్దని ఎస్పీ వకుల్ జిందల్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. విజయనగరం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఆవరణలో ఇటీవల మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సౌండ్ పొల్యూషన్, డేంజరస్ డ్రైవింగ్, డిఫెక్టివ్ నెంబర్ ప్లేట్‌లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, పట్టుబడిన మైనర్లకు మంగళవారం కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు వారిని చదివించేందుకు, ఇతర అవసరాలకు తీర్చేందుకు శ్రద్ధ వహించే తల్లిదండ్రులు, మైనార్టీ తీరని పిల్లలకు ఖరీదైన మోటారు సైకిళ్లను కొనిచ్చి, వారి జీవితాలను ప్రమాదాల్లోకి నెడుతున్నారన్న విషయాన్ని మరిచిపోతున్నారన్నారు. డ్రైవ్ చేసేందుకు మైనర్లను అనుమతించకపోవడానికి మైనర్‌లలో మానసిక పరిపక్వత, స్థిరత్వం లేకపోవడం, అత్యుత్సాహం, ఆకతాయితనం, అతివేగంగా వాహనాలను నడపడం, రహదారి భద్రత ప్రమాణాలు పాటించకపోవడం, వాహనాలను కంట్రోల్ చేయలేకపోవడం, పరిస్థితులను సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం, ప్రమాదాలను అంచనా వేయకపోవడం వంటి కారణాలు కనిపిస్తున్నాయన్నారు. ఈ కారణాలను పరిగణనలోకి తీసుకుని మైనర్లకు డ్రైవింగ్ లైసెన్స్‌లు మంజూరు చేయడం లేదన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. ప్రతీ వాహనానికి రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ వాహనాలను డ్రైవ్ చేసేందుకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతీ ఏటా దేశంలో 2.5 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, 4–5 లక్షల మంది గాయపడుతున్నారన్నారు. ఇతర కారణాలతో మరణించేవారి సంఖ్య కంటే రోడ్డు ప్రమాదాల కారణంగానే ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయన్న విషయాన్ని ప్రతీ ఒక్కరూ తీవ్రంగా పరిగణించాలన్నారు. వాహనాలకు సకాలంలో ఇన్సూరెన్స్ చేయించుకోవడం వలన ప్రమాదాలకు గురైన బాధితులకు చెల్లించాల్సిన డబ్బులను ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లిస్తుందన్నారు. మైనర్లు వాహనాలను డ్రైవ్ చేసి, ఇకపై పట్టుబడితే ఆయా వాహనాలను సీజ్ చేయడంతో పాటూ, వారి తల్లిదండ్రులు లేదా వాహన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులపై కేసులు నమోదైతే వారు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు, ఉద్యోగాలు, చదువుల నిమిత్తం విదేశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. వాహనదారులు తమ వాహనాలను అనుమతి ఉన్నట్లే తమ భద్రతకు, ఇతర వాహనదారుల భద్రతకు కొన్ని బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన 88 వాహనాలను ఎంవీ నిబంధనల ప్రకారం సీజ్ చేసే అవకాశం ఉన్నప్పటికీ, మైనర్ల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని, సీజ్ చేసిన వాహనాలను రిలీజ్ చేయాలని, వాహనదారులకు చలానాలు విధించాలని ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ పి.రంగనాథ్, ఎస్ఐలు లోవరాజు, శంభాన రవి, ఎ.మహేశ్వరరాజు, త్రినాథరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాలువ సమస్యల పరిష్కారానికి చర్యలు



కాలువలు పరిశీలిస్తున్న అధికారుల బృందం

విజయనగరం: నగరంలోని గంటస్తంభం ప్రాంతంలో ఉన్న ప్రధాన కాలువ సమస్య శాశ్వత పరిష్కారానికి నగరపాలక సంస్థ అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు అధికారుల బృందం కాలువ పరిస్థితిపై మంగళవారం సమీక్షించారు. అక్కడికి చేరుకుని కాలువ స్థితిగతులు, పెద్ద ఎత్తున పేరుకుపోయిన పూడిక, వర్షపునీటికి అడ్డంకి లేకుండా చేపట్టవలసిన చర్యలు గూర్చి చర్చించారు. ఇందుకోసం శాశ్వత ప్రాతిపదికన సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఈఈ కె.శ్రీనివాసరావు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు ప్రధాన కాలువ స్థితిని నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ వర్షాలు కురిసే సమయంలో గంటస్తంభం సమీపంలో ఉన్న ప్రధాన కాలువతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతం కావడంతో ప్రధాన కాలువలో చెత్త అధికంగా పేరుకుపోవడం పరిపాటిగా మారిందన్నారు. దీంతో ప్రతిసారి ప్రధాన కాలువలో పూడిక పేరుకుపోయి వర్షాకాలంలో సమస్య తలెత్తుతుందన్నారు. ఇందుకోసమై శాశ్వత ప్రాతిపదికన ప్రధాన కాలువ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాలకృష్ణ, అంజిబాబు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి



కొత్తపేటలో ఓడీఎఫ్ సర్వే తీరును అడిగి తెలుసుకుంటున్న డీపీఓ శ్రీధర్‌రాజా

నెల్లిమర్ల రూరల్: స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రాజా అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన ఓడీఎఫ్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ఆరు బయట మలమూత్ర విసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, దీనికి ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రతీ ఇంటికీ మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలని, లేని ఇళ్లను గుర్తించి నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఓడీఎఫ్ సర్వే పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రామంలో సర్వే ప్రగతిపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిడుతూరి రామారావు, ఈఓపీఆర్డీ సింహాద్రి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: మహిళా ప్రాంగణంలో పలు వృత్తుల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తి కలిగిన యువతులు, గృహిణులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రాంగణం మేనేజర్ పి.విమల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేసిక్ కుట్టు మిషన్ ఆపరేటర్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ మూడు కోర్సుల్లో శిక్షణ పొందగోరే మహిళల వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. కుట్టు మిషన్ ఆపరేటర్, మగ్గం వర్క్‌లో శిక్షణ పొందేందుకు కనీస విద్యార్హత 8వ తరగతి ఉండాలని, బ్యూటీషియన్ కోర్సుకు 10వ తరగతి ఉత్తీర్ణత అవసరమని పేర్కొన్నారు. బ్యూటీషియన్ కోర్సు శిక్షణ 3 నెలలు మిగిలిన రెండు కోర్సులకు 2 నెలలు పాటు శిక్షణ ఉంటుంది తెలిపారు. శిక్షణ పొందాలనుకునేవారు ఆగస్టు18లోగా దరఖాస్తు చేయాలని, 20 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్టు చెప్పారు.

గోవులను రక్షించాలి

- గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ



శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న గో సంరక్షణ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం ఫోర్ట్: గోవులను రక్షించాలని గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. కొత్తపేట నీళ్ల ట్యాంక్ సెంటర్‌లో గల శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం కార్పొరేషన్ పరిధిలో గోవధ జరుగుతున్న అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. కబేళా నిర్వాహకులతో అధికారులు కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో కెవిఆర్.సత్యనారాయణ, మద్దిల సోంబాబు, టి.వి.శ్రీనివాసరావు, రెడ్డిపల్లి రవిశంకర్, రవికిరణ్, ఉప్పాడ పైడితల్లి, నీలాపు దేవి, గండికోటి శాంతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించిన నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం పర్యవేక్షించారు. దాసన్నపేట, అశోక్ నగర్, కంటోన్మెంట్, బొగ్గుల దిబ్బ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పరంగా నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే చుట్టుపక్కల ఉన్న వ్యాపారస్తులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి కేంద్రాలుగా తయారవుతాయని దీనివల్ల అంటురోగాలు ప్రబలే అవకాశం ఉంటుందని చెప్పారు. కాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య పర్యవేక్షకులు సాలెం రాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు ఆషాఢం సారె

- వేలాది మంది భక్తులతో పులకించిన విజయనగరి
- పులివేషాలు, కోలాటాలతో సంబరాలు
- అమ్మ వేషధారణలో చిన్నారులు
- ఆలయమంతా సారెతో నింపిన భక్తులు



అమ్మవారికి సమర్పించిన సారె



పైడితల్లికి సారె తీసుకువస్తున్న సింహ శైల సేవా సమితి భక్తులు

విజయనగరం టౌన్: సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి ఆషాడం సారెను సింహ శైల సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి సమర్పించారు. కోటశక్తికి పూజలు నిర్వహించి అనంతరం అక్కడ నుంచి అమ్మవారి చదురుగుడి వరకూ వేల మంది భక్తులు భారీ ఊరేగింపు నిర్వహించారు. కోలాట ప్రదర్శనలు, సాము గరిడీలు, పులి వేషాలతో పండగ వాతావరణాన్ని నెలకొల్పారు. భాజాభజంత్రీలు, విచిత్ర వేషధారణలు ఆద్యంతం భక్తిభావాన్ని పెంపొందించాయి. చిన్నారులు వేపాకులతో నృత్యాలు చేస్తూ, భజనలు చేస్తూ అలరించారు. మహిళలు కోలాట ప్రదర్శనలు రక్తికట్టించాయి. అమ్మవారి వేషధారణలో ఉన్న చిన్నారులు ఆకట్టుకున్నారు. చదురుగుడిలో అమ్మవారికి పళ్లెంలలో స్వీట్లు, పండ్లు, పువ్వులు, పసుపు, కుంకుమలు, గాజులు, అరిసెలు, బూరెలతో నివేదన చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అవనాపు విజయ్ దంపతులు ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేద పండితులు వేదాశీస్సులు, అమ్మవారి శేషవస్త్రాలను అందించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.



పులివేషాలు

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



పినతాడివాడలో రోగులు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై డీఎంహెచ్‌ఓ ఆరా

డెంకాడ: వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సీజనల్ వాధులపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు అన్నారు. మండలంలోని పినతాడివాడ గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన అక్కడ జరుగుతున్న కుటుంబ వైద్యుని కార్యక్రమంలో భాగంగా రోగులకు, గర్భిణులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా పని చేయాలన్నారు. అనంతరం డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డ్రగ్‌స్టోర్, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌టీ టీం ద్వారా గ్రామాల వారీగా సమాచారం తెప్పించుకుని ఏ రోజుకు ఆ రోజు వచ్చిన సమాచారాన్ని సమీక్షించాలన్నారు. అవసరం మేరకు మందులను అందజేయడం జరిగిందని, ప్రజలకు ఎలాంటి అవసరం లేకుండా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరగాలన్నారు. ఎంసీహెచ్, ఆర్‌సీహెచ్ సేవలు అప్‌లోడ్‌పై దృష్టి సారించి శతశాతం చేసే విధంగా పని చేయాలన్నారు.

రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సహాయ కమిషనర్ తిరుమలరావు

విజయనగరం: రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్.తిరుమలరావు ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ వసూళ్ల పని తీరు, పురోగతిపై చర్చించారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికిగాను మిగిలి ఉన్న అన్ని బకాయిలను వసూలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. కొత్తగా ఆస్తి పన్ను విధింపు విషయంలో కూడా నిర్లక్ష్యం వద్దని సూచించారు. ఇంకా పన్ను విధింపులేని ఆస్తులు, ఖాళీ స్థలాల వివరాలను యుద్ధ ప్రాతిపదికన సేకరించి అవసరమైన పన్ను విధింపు జరిగే విధంగా చూడాలన్నారు. నగర పాలక సంస్థ ఆధీనంలో ఉన్న షాపుల అద్దె బకాయిలను కూడా వెనువెంటనే వసూలు చేయాలని చెప్పారు. దీర్ఘకాలికంగా ఉన్న బకాయిలను ఉపేక్షించవద్దని తెలిపారు. నోటీసులు జారీ చేసినప్పటికి స్పందించకుంటే షాపులు సీజ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, వినోద్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు



వైద్య శిబిరంలో బీపీ పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని ద్వారపూడి గ్రామంలో తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సుమారు 300 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, స్త్రీల సంబంధిత వ్యాధులు, కంటి సమస్యలు తదితర వైద్యసేవలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపాటి సమస్యలున్నప్పుడు వెంటనే వాటిని వైద్యుల సలహాలతో పరిష్కరించుకోవాలని సూచించారు. డాక్టర్ కె.తిరుమల ప్రసాద్, డాక్టర్ అనూషా, డాక్టర్ జ్యోతి, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు బొద్దల మృణాళిని, సర్పంచ్ యజ్జల ఆదిలక్ష్మి, వెన్నె శ్రీనివాసరావు, బొద్దల నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు



ఆంజనేయస్వామి సన్నిధిలో పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలు నిర్వహించిన అనంతరం.. ఆలయ ప్రధాన ముఖద్వారం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో అభిషేకాలు జరిపించారు. అనంతరం నూతన వస్త్రాలతో స్వామిని సుందరంగా అలంకరించి తమలపాకులు, సింధూరంతో అర్చనలు నిర్వహించారు. స్వామి సన్నిధిలో హనుమాన్ చాలీసా పఠించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, పవన్, రామగోపాలాచార్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



సెంచూరియన్ వర్సిటీ ఆవరణలో మొక్కలు నాటుతున్న వీసీ పీకే మహంతి, విద్యార్థులు

- సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'తల్లి పేరు మీద ఒక మొక్క' అనే కార్యక్రమాన్ని మండలంలోని టెక్కలి సెంచూరియన్‌లో మంగళవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మొక్కలతో మానవ మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరు ప్రధాని పిలుపులో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెద సాగుతో అధిక దిగుబడులు

పూసపాటిరేగ : వెద పద్ధతిలో సాగు చేసిన వరిలో కలుపు సమస్య జఠిలమైతే జాగ్రత్తలను తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయ అధికారిణి కొల్లి నీలిమ మంగళవారం సూచించారు. కూలీలు కొరత అధికమై, కూలీలు రేట్లు పెరిగిన పరిస్థితుల్లో రైతులు కలుపు మందుల వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, స్థానిక వ్యవసాయ అధికారులు సిఫార్సు చేసిన మేరకే కలుపు మందులను వాడాలని సూచించారు. దీని వలన తక్కువ ఖర్చుతో కలుపు నివారించవచ్చని, సకాలంలో సమర్థవంతంగా కలుపు నివారణ జరుగుతుందని తెలిపారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

